



నీలి..నీలి.. ఆకాశం..

ఆకాశం రంగులు పులుముకుంది.. సూర్యోదయం సమయంలో నీలి రంగులోకి మారిన ఆకాశం పచ్చని పంట పొలాలపై పడి ఆకట్టుకుంది. ఈ ముగ్ధ మనోహర దృశ్యం దండేపల్లి శివారులో శుక్రవారం తెల్లవారుజామున ఆవిష్కృతమైంది.. ఈ చిత్రాన్ని ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.

- దండేపల్లి, ఆంధ్రజ్యోతి

పురుషులతో సమానంగా విధులు నిర్వహించాలి
- సమీక్ష సమావేశంలో అడిషనల్ డీజీపీ అభిలాష్ బిస్త్ 7

అమ్మపాలే అమృతం
- బిడ్డకు పాలిస్తే తల్లికి ఆరోగ్యం
- ప్రారంభమైన తల్లి పాల వారోత్సవాలు 6

మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత

- రీజనల్ మేనేజర్ ప్రభుదాస్



మహిళ గ్రూప్ సభ్యులకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

నస్పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థిక అభివృద్ధికి రుణాలు అందించి చేయూతనిస్తామని, పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మంచిర్యాల రిజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్ అన్నారు. నస్పూర్ పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లిశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 36మహిళ సంఘాలకు రూ.6.50కోట్ల రుణాలను అధికారులు పంపిణీ చేశారు. బ్యాంకు ఆవరణలో నిర్వహించిన సమావేశానికి ప్రభుదాస్, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజ మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ సీతారాంపల్లి శాఖ పరిధిలో మహిళా సంఘాలు బాగా పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటివరకు 632 సంఘాలకు రూ.50కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. ముద్ర యోజన పథకం కింద 30 మంది మహిళలకు రూ. 15లక్షలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రిజనల్ రుణాల ప్రధాన అధికారి రవి కిషోర్ రెడ్డి, బ్రాంచీ మేనేజర్ నర్సింహస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ రవి, మెప్మా టీఎంసీ నాగరాజు బ్యాంకు సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత దీక్షకు మద్దతు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాగృతి రాష్ట్ర నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 4నుంచి 7వరకు ఇందిరా పార్కు వద్ద ఎమ్మెల్సీ కవిత చేస్తున్న దీక్షకు మద్దతుగా నిలవాలని సింగరేణి జాగృతి జిల్లా ఇన్‌చార్జి వెంకట్, రాష్ట్ర యునైటెడ్ పూలేఫోరం అధికార ప్రతినిధి అత్తారి మారయ్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సురభిఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీలకు రాష్ట్రప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ ప్రకటించి గరవ్నర్ ఆర్డినెన్స్ ఆమోదించకుండా ఉంటే రాష్ట్ర పతి బిల్లు ప్రభుత్వం ఎందుకు లీగల్ ఫైట్‌చేయడం లేదన్నారు. ఎన్నికలు నిర్వహించడం ఎంతముఖ్యమో,బీసీ రిజర్వేషన్‌లు కల్పించడం కూడా అంతే ముఖ్యమన్నారు.

దీక్షకు కార్మిక సంఘాల నాయకులు, ప్రజలు, బీసీ నాయకులు మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో మహిళ రాష్ట్ర నాయకులు తిరుమల, నాయకులు భువనచంద్ర, మౌనిక్, అభి, సునీల్, సందీప్, మహేష్, సురేష్, నాగరాజు, శ్రీనివాస్,సుధీర్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

చెన్నూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రకార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి శనివారం చెన్నూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు మందమర్రి మార్కెట్‌లోని వెంకటేశ్వర ఆలయం సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. 11.30గం టలకు రామకృష్ణాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను ప్రారంభించడంతో పాటు రేషన్‌కార్డులు అందజేయనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు చెన్నూరులోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకోనున్నారు. సాయంత్రం 4గంటలకు పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్స్‌లో నిర్వహించే సన్మాన సభలో పాల్గొనున్నారు.

క్రీడల్లో రాణించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని హైద్రాబాద్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గతనెల 28న లక్షెట్టిపేటలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కాగా శుక్రవారం సీఐ సన్మానించి అభినందించారు. సీఐ మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిస్తే ఉజ్వలభవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, కోచ్‌రాంవేణు, ప్రధానపాధ్యాయుడు గణపతి, ఉపాధ్యాయులు బద్రి, శ్రీజ, షరీనా, శివానీ, సదానందం, కృష్ణ మోహన్, వెంకటస్వామి పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

- వర్షాల కారణంగా వేగంగా వృద్ధి
- సాయంత్రం వేళల్లో కుప్పలుగా ఇళ్లల్లోకి
- నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం
- డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం
- మున్సిపాలిటీల తీరుపై ప్రజల అసహనం

విజృంభిస్తున్న దోమలు..

మంచిర్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో దోమల వృద్ధి వేగంగా జరుగుతోంది. గుంపులు గుంపులుగా పుట్టుకొస్తున్న దోమలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు.. చెరువులు, నాలాల పక్కనున్న కాలనీల్లో ప్రజలు తలుపులు తెరవాలంటేనే భయపడిపోతున్నారు. వీధుల్లో డ్రైనేజీలను రోజుల తరబడి శుభ్రపరచకపోవడం, మురికి నీటిపై దోమలు వేగంగా వృద్ధి చెందుతుండటంతో ప్రజలు రోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ పరిస్థితి గ్రామ పంచాయతీలతో పోల్చితే మున్సిపాలిటీలలో మరింత అధ్వానంగా తయారైంది.

జాడలేని ఫాగింగ్...

వర్షాకాలం ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వీధుల్లో ఫాగింగ్ చేపట్టకపోవడమే అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వర్షాకాలం ప్రారంభమైందంటే గతంలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తేడా లేకుండా విరివిరిగా దోమలనివారణ చర్యలు చేపట్టేవారు. మున్సిపాలిటీల్లో మంచి శుక్రవారం, మంచి ఆదివారం పేరుతో అధికారులు, పాలకులు పారిశుధ్య పనులు చేపట్టేవారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి కూడళ్లు, టైర్ల కొట్లు, డ్రైనేజీల్లో నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టేవారు. కొబ్బరి బోండాల్లోనూ నీరు నిలువ ఉండ కుండా వాటిని జనావాసాల నుంచి దూరంగా తరలించేవారు. ఇళ్ల, పరిసరాలతో పాటు నిర్మాణంలోని నీటి ట్యాంకులు, వ్యర్థాలు, పాతసామగ్రిని తనిఖీ చేసేవారు. నీటి నిల్వలు తొలగించి, దోమల మందు పిచికారీ చేసేవారు. ఇటీవల భారీవర్షాలు కురవడంతో సహజంగానే బయటి

(తరువాయి 7లో)

శ్రావణ శుక్రవారం సందడి..

దండేపల్లి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని దండేపల్లిలో ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మణిద్వీప వర్ణన పారాయణం, లలితసహస్ర పారాయణ చాలీసా, వాసవిమాత పారాయణ ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మ్యాదరిపేటలో వైభవలక్ష్మి పూజలు చేసి ఆర్యవైశ్యలకు పసుపు బొట్టులను పంపిణీ చేశారు.

282 జీవోను వెంటనే రద్దు చేయాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 282 నెంబర్ జీవోను రద్దుచేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎం. రాయమల్లు, రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ జీవోతో కార్మికులకు 10గంటల పనిదినాలు చట్టబద్ధం అవుతాయన్నారు. ఈజీవోలతో పరిశ్రమల యాజమాన్యాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా అమలు చేస్తూ కార్పొరేట్ల కొమ్ము కాస్తోందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 282 జీవో కార్మికుల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. వెంటను జీవోను రద్దుచేసి 8గంటల పనిదినాలను అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో తమయూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు

భీమిని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : చిన్నతిమ్మాపూర్ గ్రామ కార్యదర్శిపై బీజేపీ నాయకులు శుక్రవారం ఎంపీడీవో గంగామోహన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో కోట మల్లేష్‌కు చెందిన ఆవులను కట్టే తనుగులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తీసుకొని వెళ్లాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి తిరుపతి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందని, వీధి దీపాలు వెలుగడం లేదని, చెత్త సేకరించే ట్రాక్టరు మూలకు నెట్టేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శిపై తగు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ గంగామోహన్ ను వివరణ కోరగా వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, కార్యదర్శి పొట్లపల్లి శేఖర్ ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

వేమనపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తివెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం వేమనపల్లి మండల కేంద్రంలో బీజేపీ ఎన్నికల కార్యశాల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు.

ఇందుకోసం నాయకులు, కా ర్యకర్తలు కృషి చేయాలని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలను ప్రజలందరికి వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, వీటిని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ముల్కలపేట గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏట మధుకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరీంనగర్ నుంచి మంచిర్యాలకు ఎలక్ట్రిక్ బస్సులు

లక్షెట్టిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట మీదుగా మంచిర్యాల వరకు నాలుగు ఎలక్ట్రిక్ ఎక్స్ ప్రెస్ బస్సులను ప్రారంభించినట్లు కరీంనగర్-2 డిపో డీఎం ఎం.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6:10 వరకు ప్రతీ 30 నుంచి 45 నిమిషాలకు బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఇందిర మహిళా శక్తితో ఆర్థికంగా ఎదగాలి



దండేపల్లి ఐకేపి కార్యలయంలో సమావేశంలో ఏపిఎం లక్ష్మి

దండేపల్లి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిర మహిళా శక్తితో ఆర్థికంగా ఎదగాలని దండేపల్లి ఐకేపీ ఏపీఎం తోట లక్ష్మి కోరారు. శుక్రవారం దండేపల్లి ఐకేపీ ఏపీఎంగాలక్ష్మి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కార్యలయ సీసీ, వివోఏలతో పరిచయ వేదిక ఏర్పాటు చేసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనే లక్ష్యంతో స్కూల్‌యూని ఫాం కుట్టు కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములనే చేయాలనే అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన ఏపీఎం భూపతి బ్రహ్మయ్య బదిలీపై భీమిని మండలానికి వెళ్లారు. ఆయన స్థానంలో లక్షెట్టిపేట ఏపీఎంగా లక్ష్మి దండేపల్లికి బదిలీపై వచ్చారు. అనంతరం కార్యాలయంలో సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జి ల్లా సమైక్య అధ్యక్షురాలు అల్లంల అనిత, సీసీలు లావణ్య, తిరుపతి గౌడ్, సురేందర్, అశోక్, జనార్ధన్, కోమరవెల్లి పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌లలో న్యాయం చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కాకముందు వచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లలో, అలాగే ఉద్యోగుల రోస్టర్ పాయింట్ల విషయంలో సరైన నిబంధనలు పాటించడం లేదని, న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు మాల ఉప కులాల జేఏసీ నాయకులు వినతిపత్రం అందించారు. నోటిఫికేషన్‌లలో మల, మాల ఉప కులాలకు న్యాయం చేయాలని, రోస్టర్ పాయింట్‌లో 16వస్థానాన్ని గ్రూప్3 వారికి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, వెంకటరమణ, రవికుమార్, రాంకుమార్, కృష్ణ, యోహాను, నరేష్, కార్తీక్, గోపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జన్నారం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటి డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆరోగ్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. టీబీ, మలేరియా, డెంగ్యూ, లెపరసి, వైరల్ హెపటైటిస్ ప్రసూతి కేసులపై సమీక్షించారు. ప్రతి వారంలో ఎన్ని కేసులు అవుతున్నాయని పరీక్షలు నిర్వహించిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రతిరోజు వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందాయన్నారు. ఆయనవెంట డాక్టర్ ఉమశ్రీ, లక్ష్మీ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ కుమార్ దీపక్



కుందారంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గంగిపెల్లి గ్రామంలోని పల్లె దవాఖానా, కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిష్టర్‌లను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం అయినందున అంటు వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిపంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గంగి పెల్లి పల్లెద వాఖానాలో విధులకు గైర్హాజరైన వైద్యులకు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గంగిపెల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించి వంటశాల, మూత్రశాలలు, తరగతి గదులు, పరిసరాలను, అదనపు భవన నిర్మాణ పనులను పరిశీలిం చారు. పదవ తరగతి విద్యార్థినీలకు పాఠాలు బోధించి ప్రశ్నలు అడిగి పఠన సామర్థ్యాలను తెలుసుకున్నారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

గోదావరి జలాలపై ఆంధ్ర పాలకుల కుట్రలు

- మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపు...
- విద్యార్థి సదస్సులో వక్తలు...

నస్పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గోదావరి జలాలపై ఆంధ్ర పాలకులు మళ్లీ కుట్రలు చేస్తున్నారని, దానిని ఎదిరించి అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్సీ దేశప తి శ్రీనివాస్, వాటర్ బోర్డు మాజీ చైర్మన్ వేముల ప్రకాష్ ధ్వజమెత్తారు. నస్పూర్ ప ట్టణంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు రద్దు కోసం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ బనకచర్ల ద్వారా తెలంగాణ నీటి హక్కులను కొల్లగొట్టే కుట్రలు అడ్డుకోవాలన్నారు. ఆంధ్ర పాలక ప్రభుత్వం అక్రమంగా నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులను ఆపాలన్నారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బనకచర్లను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చే సి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఎం పీలు, మంత్రులు పార్లమెంట్ ఈ విషయంపై కొట్లాడాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ చంద్రబాబు డైరెక్షన్‌లో నడుస్తోందని ఆరోపించారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసి సాధించుకున్నామని, మళ్లీ గోదావరి జలాలను కా పాడుకునేందుకు ఉద్యమానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ హయాంలో తాగు, సాగు నీటికి అధిక ప్రాధాన్యత కల్పించి వ్యవసాయ రంగాన్ని మ రింతగా అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక పిల్లర్ వద్ద పగుళ్లు వస్తే దానిని రాజకీయం చేసారని ఆరోపించారు. ఈ సదస్సులు బీఆర్ఎస్ జిల్లా అ ధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, నాయకులు విజిత్ కుమార్, అక్కురి సుబ్బయ్య, గోగుల రవీందర్ రెడ్డి, దగ్గుల మధు, కందుల ప్రశాంత్, పల్లె భూమేష్‌లతో పాటు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేశ్‌పతి శ్రీనివాస్

బాలుడిపై వీధి కుక్కల దాడి

● ఆసుపత్రికి తరలింపు

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్ ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్లి మున్సిపాలిటి గద్దెరాగడి వద్ద వీధి కుక్కలు ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై దాడి చేసి గాయపరిచాయి. శుక్రవారం ఇంటి ముందు ఆడుకునేందుకు వచ్చిన చిన్నారిపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేయడంతో స్థానికులు గమనించి బాలున్ని రక్షించి మంచిర్యాల మాతా శిశు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన చిన్నారికి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మున్సిపాలిటి పరిధిలో వీధి కుక్కల బెడద పెరిగిపోవడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం గాంధీనగర్‌లో స్కూలుకు వెళ్లేందుకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులపై వీధి కుక్కలు దాడి చేసే క్రమంలో గమనించి విద్యార్థులకు రక్షణ కల్పించి కుక్కలను తరిమివేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను నివారించాలని క్యాతన్‌పల్లి ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జైనూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబల కుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏడీఎం హెచ్‌వో మనోహర్ అన్నారు. మండలంలోని ఉషెగాం పీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధుల నివారణ కోసం వైద్య సిబ్బంది రోజు ప్రకారం గ్రామాల్లో పర్యటిస్తూ రోగుల ఆరోగ్య స్థితి గతులపై ఆరా తీయాలని సూచించారు. పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేయాలని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందాయని అన్నారు. వాటిని అరికట్టేందుకు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఏడీఎం హెచ్‌వో మనోహర్ సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజు, హెచ్ఈవో రమేశ్, స్టోర్ ఇన్‌చార్జి సోలంకీ మంగల్ తదితరులు పాల్గొన్నారు..



తల్లిపాలే అమృతం

● బిడ్డకు పాలిస్తే తల్లికి ఆరోగ్యం
● చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి మెరుగు
● ప్రారంభమైన తల్లి పాల వారోత్సవాలు

వాంకిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలే పిల్లలకు అమృతతుల్యం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లి పాలు ఎంతగానో దోహదపడతాయి. నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలేనని నిపుణులు యూడా చెబుతున్నారు. అయితే ఈ విషయం తెలిసినా చాలా మంది ముర్రుపాలు ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు. అపనమ్మకం, అభద్రత భావం కారణం ఏదైతేనేం బిడ్డకు పాలు అందిచేందుకు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా పిల్లల్లో రోగనిరోధ కశక్తి తగ్గి భవిష్యత్తులో వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తల్లి పాల ఆవశ్యకతను తెలుపుతూ ప్రభుత్వం ఏటా వారోత్సవాలను నిర్వహిస్తోంది.

ఇందులో భాగంగా సమగ్ర శిశు క్షేమ శాఖ ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 0 నుంచి 6 నెలల శిశువులు 3,457 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు 20,357 మంది ఉన్నారు. 3 నుంచి 7 ఏళ్ల పిల్లలు 20,100 ఉన్నారు. 4,629 గర్భిణులు, 3,418 మంది బాలింతలు ఉన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే 70 శాతం మంది తల్లులు బిడ్డలకు ముర్రుపాలు అందిస్తుండగా 30 శాతం మంది ఆరు నెలల వరకు మాత్రమే పాలు పడుతున్నారని అధికారులు చెబుతున్నారు.

మొదటి రెండు రోజులు కీలకం

బిడ్డ పుట్టిన మొదటి రెండు రోజులు ఎంతో కీలకమని వైద్యనిపుణులు చెబుతున్నారు. పుట్టిన కొద్ది సేపటికే ముర్రుపాలు తాగేలా చూడాలి. ఈ రోజుల్లో ఇచ్చే పాలల్లో కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇందులో రోగ నిరోధక శక్తి పెంచే అంశాలు ఉంటాయి. బిడ్డ పలు రకాల వ్యాధుల బారిన పడకుండా ఎంతగానో దోహ దపడుతుంది. దీంతో పాటు ఆరు నెలల వరకు తల్లి పాలను మాత్రమే అందించాలి. తర్వాత మంచి పౌష్టికాహారాన్ని ఇవ్వడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు. బిడ్డ ఎతుగుదలకు కావాల్సిన ప్రోటిన్లు, పోషకాలు, మాంసకృత్తులు, పిండి పదార్థాలన్ని సమతుల్యంగా తల్లిపాలల్లో లభిస్తాయి. అందువల్ల తప్పనిసరిగా ఆరు నెలల వరకు తల్లి పాలనే పట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రచారం చేస్తుంది.

తల్లికి పోషకాలు అవసరం

ప్రసవం తరువాత బాలింతలు తీసుకునే ఆహారం కూడా పోషక విలువలు కలిగి ఉండాలని వైద్యులు చెబుతున్నారు. తల్లి పోషకాహారం తీసుకుంటే బిడ్డకు కూడా అలాంటి ఆహారాన్ని అందిచేందుకు అవకాశం ఉటుంది. రోజు 600 గ్రాముల అన్నం, 200 గ్రాముల పప్పు, 150 గ్రాముల కూరలు, ఉడకబెట్టిన గుడ్డు, ఒ పండు, 100 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి. ప్రతి రోజు ఆహారంలో పప్పు, ఆకు కూరలు పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

రిబ్కా, ఇన్‌చార్జి సీడీపీవో, వాంకిడి



ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలను గర్భిణులు, బాలింతలు సద్వి నియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏటా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. వారం రోజుల పాటు ప్రతి అంగన్ వాడీ కేంద్రం పరిధిలో కార్యక్రమం కొనసాగతుంది. తల్లిపాలు బిడ్డకు అందించడం ద్వారా ఎలాంటి లాభాలు చేకురుతాయనే అంశంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తాం,

ప్రయోజనాలు..

● పోతపాలు తాగే వారితో పోలిస్తే తల్లిపాలు తాగిన పిల్లల్లో ఊబకాయం, గుండె జబ్బులు, అధిక రక్త పోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు తక్కువని వైద్యులు చెబుతున్నారు.
● రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది, ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. ఎముకల పుష్టి బాగుంటుంది.
● కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే శాతం తక్కువ. మానిసిక రుగ్మతలు దూరమవుతాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.
● పాలు ఇవ్వడం వల్ల బిడ్డకే కాకుండా తల్లి ఆరోగ్యానికి మంచిది.
● కాన్పు తరువాత వచ్చే కొన్ని రకాల మానసిక వ్యాధులు తల్లి దరిచేరవు.
● బిడ్డకు పాలిచ్చే స్త్రీలో రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటుంది.

అర్హులకు సంక్షేమ పథకాలు

దహెగాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు వస్తాయన్నారు. పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసం ప్రజా ప్రభుత్వం నిత్యం పాటు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో ఆల్బర్ట్, పీసీఏఎస్ చైర్మన్ తిరుపతిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ అన్నారు. వంద రోజుల కార్యచరణ ప్రణాళిలో భాగంగా శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్, వైఎస్ఆర్ నగర్, ఆర్ఆర్ కాలనీతో పాటు పలు వార్డుల్లో మున్సిపల్, వైద్య సిబ్బంది ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ కూలర్లలో ఉన్న నీటిని తొలగించి దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. ఆగి ఉన్న ప్రదేశాల్లో అయిల్ బాల్ వేశారు. అలాగే ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గజానంద్, వైద్యాధికారి వినోద్‌కుమార్, టీఎంసీ అరుణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఆశ్రమ వసతి గృహాల్లో పని చేస్తున్న పర్మినెంట్, డేలీవేజ్ కార్మికులు, పార్టుటైం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాంచందర్, పోచయ్య, రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కౌటాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు విషయంలో ప్రజా ప్రభుత్వం దేశానికి ఆదర్శకంగా నిలిచిందన్నారు. గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. నేడు ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు వస్తాయన్నారు. పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసం ప్రజా ప్రభుత్వం నిత్యం పాటు పడుతుందన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్ర యాణ కల్పించామని తెలిపారు. మహిళలకు ప్రధాన్యం ఇస్తూ మహిళా సమాఖ్య సంఘాల ద్వారా మహిళలకు అద్దె బస్సులను ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంత య్య, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్, ఏడీఏ మనోహర్, డీసీఎస్ఓ సాదీక్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతే వేదికలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కల్టెర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాలతో కలిసి రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులైన పేద వారికి రేషన్ కార్డులు అందించి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లయితే రెవెన్యూ సిబ్బంది ద్వారా సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి, తహసీల్దార్ దౌలత్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, సహాయ పౌర సరఫరాల అధికారి సాధీక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



మనోజ్(ఫైల్)

దండేపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొండా పూర్ గ్రామానికి చెందిన ఇప్ప మనోజ్(31) అనే వ్యక్తి చేసిన అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తహసీయోద్దీన్ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మనోజ్ కొంతకాలం క్రితం వరికోత మిషన్ కొనుగోలు చేశాడు. అది నడవకపోవడంతో అప్పులపాలై ఆ మిషన్‌ను అమ్మేసాడు. ఇటీవల సుమారు 4లక్షల రూపాయల వరకు ఫైనాన్స్ తీసుకొని ట్రాక్టర్ కొనుగోలు చేయగా అదికూడా సరిగ్గా నడవకపోవడంతో మరింత నష్టపోయాడు. చేసిన అప్పులు తీర్చే దారి లేక మానసికంగా కుమిలిపోయాడు. ఇదే వషయం భార్యతో చెప్పి బాధపడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పొలం వద్దనే పురుగుల మందు తాగాడు. అనంతరం బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వారు పొలం వద్దకు చేరుకుని ఆసుపత్రికి తరలంచారు. అప్పటికే మనోజ్ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో యువతి ..

నెన్నెల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జీ గ్రామానికి చెందిన అద్దరపల్లి మమత (19) అనే యువతి ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు చెప్పిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పదో తరగతి వరకు చదువుకున్న మమత ఇంటి వద్దనే ఉంటోంది. ఏడాది కిందట రూ. 1.60 లక్షలతో సెకండ్ హ్యాండ్ ఆటో కొనుగోలు చేసి డ్రైవర్‌తో నడిపించుకుంటూ ఉపాధి పొందుతోంది. అప్పటికే ఆ ఆటోపై ఫైనాన్స్ ఉంది. ఆ విషయం తెలియక మమత ఆటో కొనుగోలు చేసింది. పాత ఓనర్ ఈఎంఐ కట్టకపోవడంతో నెల రోజుల కిందట ఆటోను ఫైనాన్స్‌వారు సీజ్ చేసి తీసుకెళ్లారు. తాను పూర్తి డబ్బులు చెల్లించి తీసుకున్నానని చెప్పినా వినకుండా ఆటోను ఫైనాన్సర్లు తీసుకెళ్లడంతో బాధపడుతూ ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంట్లోవారంతా పొలంపనులకు పోయాక ఇంట్లోనే ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పనులు ముగించుకొని పొద్దుపోయాక కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి మమత దూలానికి వేలాడుతూ కనపడింది. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి నాగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కాగజ్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కాగజ్‌నగర్ ఈసుగాం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పెండింగ్ సమస్యలను ఎస్‌హెచ్‌వో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజా ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని సూచించారు. . కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

సిర్పూర్(టి), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. సిర్పూర్(టి) రేంజ్‌లోని ముత్తంపేట అటవీ ప్రాంతంలో బీట్ ఆఫీసర్ లక్ష్మి గస్తీ తిరుగుతుండగా ముత్తంపేట గ్రామానికి చెందిన బెండారి రామయ్య అనే వ్యక్తి అటవీ భూమిని ఆక్రమించినట్లు గుర్తించారని అన్నారు. సెక్షన్ ఆఫీసర్ అతారుద్దీన్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్‌లకు సమాచారం అందించగా వారు కేసు నమోదు చేశారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుడిని ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించారు. పోడు భూములు సాగు చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఉద్యోగుల రక్షణలో సూపర్‌వైజర్లది ప్రముఖపాత్ర

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల రక్షణలో సూపర్‌వైజర్లది ప్రముఖ పాత్ర అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. వీటీసీలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లకు నిర్వహించనున్న 12 రోజుల శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకోమారు అందించే శిక్షణతో అనేక మెళకువలు నేర్చుకోవచ్చన్నారు. భూగర్భ, ఉపరితల గనుల్లో రక్షణను పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి వెలికితీయాలన్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులను రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, వీటీసీ మేనేజర్ కమ్రుద్దీన్, రామారావు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వర్ష ప్రభావంతో తగ్గిన బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో వర్షాల ప్రభావంతో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై నెలలో 88 శాతం ఉత్పత్తి సాధించామన్నారు. ఇందులో ఉపరితల గనులు 89 శాతం, భూగర్భ గనులు 85 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్‌కే 5, ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్, ఎస్ఆర్‌పీ 1, ఇందారం ఓసీపీలు వంద శాతం సాధించాయన్నారు. అలాగే 4లక్షల 71 వేల 216 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు వివరించారు. సమావేశంలో డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, సీనియర్ పీవో పి కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటాను వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సాధించిన లాభాలను వెంటనే ప్రకటించి, ఉద్యోగులకు వాటాను చెల్లించాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కె. విశ్వనాథ్, శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. పోషమల్లు డి మాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు నెలలుగా సింగరేణి యాజమాన్యం ప్రకటన చేయకపోవడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని 40 శాతం వాటాను చెల్లించాలని కోరారు సమావేశంలో బి. రాంచందర్, ముత్తన్న, రాజు, రాయపోషం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

మందమర్రిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మందమర్రి ఏరియాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏరియాలోని అన్ని గనుల డిపార్ట్‌మెంట్ల వద్ద గుర్తింపు సంఘం ఏఐటీయుసీ ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఏరియాలోని కేకే5, కేకేఓసీ, వర్కుషాపు, సివిల్‌డిపార్ట్‌మెంట్, ఎస్అండ్‌పీసీ కార్యాలయాల వద్ద నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాము రాజీలేని పోరాటాలు చేశామని తెలిపారు. యాజమాన్యం ఉద్యోగుల సమస్యలను వెనువెంటనే పరిష్కరించేం దుకు చొరవ చూపాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే వెల్లడించి 75శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సొంతింటి పథకం అమలు కు యాజమాన్యం ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఏరియాలోని గనుల, డిపార్ట్‌మెంట్లలో ఉన్నటువంటు పోస్టుల ఖాళీల భర్తీకి చొరవ చూపాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ తక్షణమే సెటిల్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెర్క్స్‌పై ఇన్‌కం టాక్స్ యాజమాన్యమే చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు సమస్యలు పరిష్కరించడంతో పాటు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయ కులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, కుమార స్వామి, రాజేశం, కలవేణ శ్రీనివాస్, ఓదెలు, సృజన, దీపిక, సంజీవ్, సీవీ రమణ, సోమిశెట్టి రాజేశం, ఎగ్గడి రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, విక్రమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట (ఆంధ్రజ్యోతి): గని కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయుసీ ఆధ్వర్యంలో శుక్రవారం కాసిపేట 2వ గనిపై నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కాసిపేట 2వ గని ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో లాభాలా వాటాను వెంటనే ప్రకటించాలన్నారు. 25శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గని మేనేజర్ లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ ఫిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నర్సయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ బొద్దుల వెంకటేశ్, కమిటీ సభ్యులు జావీద్, దేవులపల్లి శ్రీనివాస్, రాజు, కొమురయ్య, రవి, సాగర్, లింగమూర్తి, అమ్జద్‌ఖాన్ పాల్గొన్నారు.



ఏరియా వర్క్‌షాపులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెడికల్ బోర్డులో రిఫరల్ కార్మికులకు అన్యాయం

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ బోర్డులో రిఫరల్ కార్మికులకు అన్యాయం జరిగిందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్‌రెడ్డి అన్నారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతూ సింగరేణి మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారిలో నుంచి ఏడాది క్రితం 55 మంది కార్మికులను హయ్యర్ రిఫరల్ సెంటర్‌కు పంపించారన్నారు. ఆ తరువాత మెడికల్ బోర్డు నిర్వహించలేదని చెప్పారు. చివరకు 52 మందికి గురువారం ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అంటూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. వారసులకు ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూసిన ఉద్యోగులకు తీవ్ర నిరాశ ఎదురైందని చెప్పారు. తమ యూనియన్ దీన్ని ఖండిస్తోందని తెలిపారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నిర్లక్ష్య వైఖరి వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు.

అనారోగ్యంతో ఉన్న కార్మికులను అన్‌ఫిట్ చేయాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్

మందమర్రిటౌన్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు మెడికల్ బోర్డుకు వెళితే వారి వ్యాధులను దృష్టిలో పెట్టుకొని అన్‌ఫిట్ చేయాలని హెచ్ ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ డిమాండ్ చేశారు. మందమర్రిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది నెలలుగా హైయర్ రిఫరల్స్ పేరుతో 52 మంది ఉద్యోగులను విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డులో దీనిలో ఐదుగురికి మాత్రమే అన్‌ఫిట్ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. 9 నెలలుగా వేతనాలు నష్టపోయి అన్‌ఫిట్ కాకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. వాస్తవంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎందుకు అన్‌ఫిట్ చేయలేదని ప్రశ్నించారు. మెడికల్‌బోర్డు విధానం మారాల్సిన అవసరం ఉందని తెలిపారు. రెండు సంవత్సరాల సర్వీసు ముందు మెడికల్ రావాలని అప్లికేషన్ పెట్టుకున్న ఉద్యోగులు హైదరాబాద్, కొత్తగూడెం వైద్యులు కాకుండా స్థానికంగానే పరిశీలించాలని కోరారు. సమా వేశంలో నాయకులు కేంద్ర కమిటీ ఏరియా కమిటీ నాయకులు పార్వతి రాజిరెడ్డి, సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కనీస పింఛన్ రూ. పది వేలకు పెంచాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఇస్తున్న పింఛన్‌ను కనీసం పది వేల రూపాయలకు పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోయేషన్ ఉప ప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లో సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతిపత్రం అందించారు. .

కోలిండియా విధానాన్ని అమలు చేయాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కోలిండియాలో పారిశ్రామిక విధానాల కోసం కార్మిక సంఘాలకు ఇస్తున్న ప్రాధాన్యతను సింగరేణిలో కూడా అమలు చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్ రాజీలేని పోరాటాలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసరాజు, మాదాసి రవీందర్, రమేష్, గుర్రం ప్రదీప్‌కుమార్, మాధవ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాంపూర్‌లో మొక్కలకు నీరు పోస్తున్న ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి

భీమిని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రాంపూర్, మండల కేంద్రంలో కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కేజీబీవీలో భోజనశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు వ్యక్తి గత పరిశుభ్రత చేతులు కడుకోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థినులకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఆయా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగా మోహన్, ఏపీవో సత్యప్రసాద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి శారద, ఈజీఎస్ సిబ్బంది, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం శాంతిఖనిగని ఆవరణలో కార్మికులతో ఏఐటీయుసీ నాయకులు గేటు మీటింగ్ నిర్వ హించారు. ఈసందర్భంగా నాయకులు చిప్ప నర్సయ్య మాట్లాడుతూ 2024-25 సంవత్సరా ని కి రావాల్సిన లాభాల వాటాను తక్షణమే 35శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సొంతింటి పథకాన్ని అమలు చేసి 300 గజాల స్థలాన్ని కార్మికులకు కేటాయించాలని పేర్కొన్నారు. మెడికల్ చార్టీల పేరుతో కార్మికుల నుంచి వసూలు చేసిన నగదును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని గనుల్లో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో దాసరి తిరుపతి గౌడ్, మంతెన రమేశ్, రాంచందర్, రాజలింగు, రమేశ్‌లు పాల్గొన్నారు.

మామిడిగూడలో విజృంభిస్తున్న జ్వరాలు

భయాందోళనలో స్థానికులు

కాసిపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిగూడెంలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. వారంలో ఆరేళ్లబాలుడు నగావత్ అభిలాస్‌కు డెంగ్యూ లక్షణాలు బయటపడడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై వైద్య శిబిరాలు నిర్వహించారు. అయినప్పటికీ జ్వరాలు అదుపులోకి రాకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పేరుకపోయిన చెత్తకు ప్పలు, డ్రైనేజీలో నిలిచిన మురికి నీరు జ్వరాలకు కారణమవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ విద్యార్థిని నగావత్ సంఘవి గురువారం మంచిర్యాల ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. మామిడిగూడెంలో కొంత మంది టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో బాధపడుతుండగా మరొరికి డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని తెలియడంతో స్థానికులు భయబ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు గుర్తించి జ్వరాల భారినుంచి ప్రజలను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మామిడిగూడ ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

హాజీపూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): గుడిపేటలోని మహాత్మజ్యోతిబాపులే బీసీ గురుకులంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు దోమకాటు వల్ల వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్య విజ్ఞానం కూడ అవసరమని హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎంజేపీ ఆర్‌సీవో షేరు శ్రీధర్, హెచ్ఈవో రఘుపతి, పర్యవేక్షకురాలు పద్మ, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, స్టాఫ్ నర్సు సుమలత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

భీమారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గత నెల 28న లక్షెట్టిపేటలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భీమారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు మనోజ్ పరుగు పందెంలో, జాను షార్ట్‌పుట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, పీడీ మారయ్య తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ నెల 3, 4 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన

భీమారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బోయవాడలో శుక్రవారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. 46 మందికి వైద్య పరీ క్షలు చేసి ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించి వారి రక్తనమూనాలను సేకరించారు. మందులను అందజేశారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో మధుసూదన్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ డబ్బాలు,పూలకుండీలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌వేణు, ఏఎన్ఎం ఉమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విలీన కష్టాలు



మంచిర్యాల కార్పొరేషన్‌లో ఐదు గ్రామాల విలీనం

ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు పెరగని జీతాలు

నెలకు 18వేల వేతనం కావాలంటున్న కార్మికులు

హాజీపూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీగా ఉన్న మంచిర్యాలను ఇటీవల కార్పొరేషన్‌గా మార్చారు. దీంతో సమీపంలోని ఐదు గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అయితే ఆరు నెలలు గడుస్తున్నా కాని పారిశుధ్య కార్మికుల వేతనాలు మాత్రం పెంచడం లేదు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు రూ. 9,500 చెల్లించేవారు. ఇప్పటికీ కార్మికులకు అదే వేతనం చెల్లిస్తున్నారు. అయితే పెరిగిన ఖర్చులకు ప్రస్తుతం వచ్చే వేతనాలు సరిపోక కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కార్పొరేషన్‌లో పని చేసే ఇతర కార్మికుల్లాగా తమకు కూడ వేతనాలు చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు గ్రామాలు, 35 మంది పంచాయతీ సిబ్బంది..

నూతనంగా ఏర్పడ్డ మంచిర్యాల కార్పొరేషన్‌లో హాజీపూర్ మండలంలోని ఐదు గ్రామాలైన వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్ గ్రామాలు విలీన మయ్యాయి. ఈ ఐదు గ్రామాల్లో 26 మంది పారిశుధ్య కార్మికులు, 9 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడు ఉదయం 6గంటలకు విధుల్లో చేరి మధ్యాహ్నం 2గంటల వరకు విధులు ముగిం చుకునేవారు. కార్పొరేషన్‌గా మారిన తరువాత ఉద యం 5గంటలకే హాజరు పడి పని ప్రదేశాలకు వెళ్లి పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. కొత్తగా విలీనం కావడంతో వారానికి రెండుమూడు సార్లు ఇక్కడి కార్మికులను కొర్పరేషన్ లోని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి పనులు చేయిస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీలు ఉన్నప్పుడు కేవలం గ్రామ పరిధిలోని పారిశుధ్య ప నులు మాత్రమే నిర్వహించేవారు. కానీ ఇప్పుడు అధికారులు ఆర్డర్ ఇవ్వడంతో ఎక్క డెక్కడికో వెళ్లి పనులు చేస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చెప్పినట్టు విధులు నిర్వహించినా కాని తమకు ఇప్పటికీ గ్రామ పంచాయతీ జీతాలే ఇస్తున్నారని, కార్పొరేషన్ జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలీన గ్రామాల్లో పారిశుధ్య కార్మికులే కాక ఇతర గ్రామ పంచాయతీల సిబ్బంది పరిస్థితి కూడా అంతే ఉంది. వారిని కార్పొరేషన్‌లో విలీనం చేసి నట్టేకాని జీతాలు పెంచడం లేదని వాపోతున్నారు. ఐదు గ్రామాల్లో కారొబార్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్‌లు, ఫీల్డ్ అసిస్టెంటులు ఆరు నెలలుగా వారి విధులపై స్పష్టత లేక పెరిగిన జీతాలపై ఆశ కోసం ఎదురు చూస్తున్నారు.

విలీన గ్రామాలపై చిన్న చూపు..

కార్పొరేషన్‌లో కొత్తగా విలీనమైన గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ నీటి సప్లై వీధి దీపాల నిర్వహణ అంతంత మాత్రమే ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో పంచాయతీలుగా ఉన్నప్పుడు కారొబార్‌కో లేదా పంచాయతీ సెక్రెటరీతో తమ సమస్యలు చెప్పుకునే వారు. ఇప్పుడు ఏ సమస్య వచ్చినా ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదం టూ చిన్న చిన్న పనులకే ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. కేవలం రెవెన్యూ సేవలు మాత్రమే అందుతు న్నాయని, ఇతరత్రా సేవల కోసం మంచిర్యాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా విలీన గ్రామా లపై కార్పొరేషన్ అధికారులు శ్రద్ధ చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు కనికరించడం లేదు...
శ్రీనివాస్, పారిశుధ్య కార్మికుడు గుడిపేట



గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు 6 గంటలకు డ్యూటి ఎక్కితే ఒంటిగంట వరకు దిగిపోయేవాళ్లం. కార్పొరేషన్‌గా మారిన తరువాత ఉదయం 5గంటలకే విధుల్లో చేరాల్సి వస్తుంది. అయినా అధికారులు చెప్పిన పనులన్నీ చేస్తున్నాం. కాని గతంలో గ్రామ పంచాయతీలో ఇస్తున్న వేతనాలు ఇస్తున్నారు. ఇతర పారిశుధ్య కార్మికులకు నెలకు 15,668 వేతనం ఇస్తూ, పీఎఫ్ కింద కూడా కొంత జమ చేస్తున్నారు. మాకు మాత్రం రూ. 9500 ఇస్తున్నారు.

నేను ఇటీవలే విధుల్లో చేరాను..
మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ సంపత్

విలీన గ్రామాల పారిశుధ్య కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలపై నాకు అవగాహన లేదు. నేను ఇన్‌చార్జి అధికారిగా ఇటీవలే చార్జి తీసుకున్నాను. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడుతాను.

అవినీతిపై సీఐడీ అధికారులు చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ పంపే లక్షలాది రూపాయల అవినీతికి బాధ్యులైన ప్రదీప్‌పై సీఐడీ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంచిర్యాల క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్, కోఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు హైదరాబాద్ సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కూడ ప్రదీప్‌పై మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికీ ఎలాంటి విచారణ జరుపలేదని సీఐడీ అధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి మొసలి పిల్లలు

హాజీపూర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఆనుకొని ఉన్న నంనూర్ శివారు పంట పొలాల్లోకి మొసలి పిల్ల వచ్చింది. నాట్లు వేసే మహిళా కూలీలు ఆందోళన చెందగా రైతు అప్పని సత్తయ్య మొసలి పిల్లను ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లోకి పంపించారు. ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు పెద్ద పెద్ద మొసళ్లు దర్శనమిస్తున్నట్లు జాలర్లు రైతులు చెబుతున్నారు.

ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గనాయకులు బం డారి రవి కుమార్ మాట్లాడుతూ జన్నారం మండలంలో టైగర్ జోన్ పేరిట ఆంక్షలుపెట్టి మండల అభివృద్ధిని అట వీశాఖ అడ్డుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో జన్నారం మండలం ఒకప్పుడు అభివృద్ధి పథంలో ఉండేదని టైగర్ జోన్ ఏర్పాటైన నుంచి టైగర్‌జోన్ పేరిట ఆంక్షలు పెరగ డంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందన్నారు. సీపీ ఎంపార్టీ నాయకులు సంకె రవి, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

జైపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జైపూర్ మహాలక్ష్మీ మండల సమాఖ్య ఏపీఎంగా టీహెచ్ సంతోష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచే సిన ఏపీఎం రాజ్‌కుమార్ బదిలీపై కాసిపేట మండలానికి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ మండల సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

విజృంభిస్తున్న దోమలు..

(5వ పేజీ తరువాయి)

వాతావరణంలో పలు రకాలుగా నీటి నిల్వలు పె రిగాయి. ముఖ్యంగా వినియోగంలో లేని భవనాలు, నిర్మాణంలో ఉన్న కట్టడాల వద్ద దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణలో ఫాగింగ్ ప్రధానం. మున్సిపాలిటీల పరిధిలో ఫాగింగ్ యంత్రాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నప్పటికీ వాటి సేవలను ఇంతవరకు..వినియోగించిన దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా రికార్డుల్లో మాత్రం ఎప్పటికప్పుడు దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు నమోదు చేస్తుండటం కొసమెరుపు. ఇదిలా ఉండగా పంచాయతీలు, మున్సి పాలిటీల్లో పాలక వర్గాలు లేకపోవడం కూడా పారిశుధ్యం లోపించడానికి కార ణమవుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

●క్లోరినేషన్ ఏదీ..?

ప్రజలు తాగే రక్షిత మంచినీటి ట్యాంకుల్లోనూ క్లో రినేషన్ చేసిన దాఖలాలు కానరావడం లేదు. నిలువ నీరు ఉన్నచోట లార్వా వృద్ధి చెందే అవకాశాలు అనేకం ఉంటాయి. క్లోరినేషన్ చేయడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అలాగే వీధుల్లోని నాలాల్లో సైతం బ్లీచింగ్ చేసిన పాపాన పోవడం లేదు. నీరు నిలువ ఉండే చోట్ల బ్లీచింగ్ చేస్తే ఆదిలోనే లార్వా అంతమై దోమల బెడద తగ్గుతుంది. ఆ చర్యలు కూడా మున్సిపాలిటీల్లో చేపట్టడం లేదు. దీంతో సాయంత్రం వేళ్లలో లైట్లు వేయగానే నాలాల్లో ఉన్న దోమలన్నీ ఇళ్లలోకి చేరుతున్నాయి. గుంపులు గుంపులుగా వస్తున్న దోమల కారణంగా ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

●పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

పరిసరాలు పరిశుభ్రంగా లేని కారణంగా వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా లాంటి విష జ్వరాలు సోకుతాయి. ముఖ్యంగా పగలు కుట్టే దోమల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉంది. అవి కుడితే డెంగ్యూ, చికన్ గున్యా వంటి తీవ్రమైన జ్వరాలు సోకుతాయి. వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులలో జ్వరపీడితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతానికి వైరల్ జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నప్పటికీ దోమల కారణంగా విషజ్వరాలు సోకే అవకాశాలు కూడా ఉన్నాయి. తాగునీరు సరఫరా చేసే ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయని కారణంగా నీరు కలుషితమై అ తిసార ప్రబలే ప్రమాదం కూడా పొంచి ఉంది. అధి కారుల వైఖరిపట్ల ప్రజలు అసహనం వ్యక్తం చే స్తున్నారు.

●జిల్లాలో ఇద్దరికి డెంగ్యూ పాజిటివ్..

విపరీతంగా పెరిగిన దోమల కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రస్తుతం 18 మంది జ్వరపీడితులు చికిత్స పొందుతున్నారు. పగలు కుట్టిన దోమల కారణంగా జిల్లాలో ఇద్దరు డెంగ్యూ బారిన పడ్డారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నప్పటికీ డెంగ్యూ బాధితుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే మరో ఇద్దరు మలేరియా బారిన పడగా, శుక్రవారం వారిరు వురూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

●పల్లెలే నయం..

పారిశుధ్య చర్యలు మున్సిపాలిటీలతో పోలిస్తే పల్లె ల్లోనే కాస్త మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పంచాయతీల్లో ఫాగింగ్, క్లోరి నేషన్, బ్లీచింగ్ తదితర పనులు చేపట్టారు. వీధుల్లో మొలిచిన పిచ్చిగడ్డిని తొలగించడం, డ్రైనేజీలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయడం వంటి పనులు చేపడుతున్నారు. డ్రైనేజీల్లో లార్వా వృద్ధి చెంద కుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్ వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయిల్ బాల్స్ నీటిలో వేయగానే చమురు విస్తరించి, ఆ పరిసరా ల్లో దోమల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుంది. త ద్వారా గ్రామాల్లో దోమల నివారణకు దోహదపడు తోంది. అయితే ఆప్రక్రియంతా కేవలం గ్రామాలకే పరిమితం కావడం గమనార్హం.

గ్రామాల్లో చేపడుతున్న దోమల నివారణ చర్యలేవీ ప్రస్తుతం మున్సిపాలిటీల్లో అమలు కావడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బెల్లంపల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): వసతి గృహల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. శుక్రవారం సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహన్ని సందర్శించారు. హాస్టల్‌లో ఉన్న వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటశాల గదిని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు భద్రత ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సాయికిరన్, టీపీవో చంద్ర శేఖర్, పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

భీమిని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భారతమాత మండల సమాఖ్య వెలుగు ఏపీఎం భూపతి బ్రహ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దండేపల్లి మండలంలో ఏపీఎంగా పనిచేసిన బ్రహ్మయ్య బదిలీపై భీమిని మండలానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమప థకాలను డ్వాక్రా సంఘాల మహిళలకు అందేలా వివరిస్తానన్నారు. సంఘాలతో నగదు రికవరీపై దృష్టి సారిస్తానన్నారు. ఐకేపీ సిబ్బంది ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సీసీలు వసంత్, శోభ, లక్ష్మణ్, గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలను అడవుల్లో మేతకు అనుమతించాలి

నెన్నెల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల మందలను అడవుల్లో మేపేందుకు అనుమతించేలా తగిన చర్యలు తీసుకోవాలని కుర్మ సంఘం నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కోరారు. కుర్మ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంట శ్రీశైలం, చిర్రం రమేష్ శుక్రవారం హైదరాబాదులో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి సమస్య గూర్చి వివరించారు. గొర్రెలు అటవి ప్రాంతానికి వెళ్తే ఫారెస్టు అధికారులు అడ్డుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పత్తి, వరి పంటలు సాగవుతున్న ప్రస్తుత తరుణంలో గత్యంతరం లేక జీవాలను మేపేందుకు అడవికి వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి గొర్రెల పెంపకందారుకు సహకరించాలని కోరారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చండి



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న జనక్ ప్రసాద్

మందమర్రిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి. జనక్‌ప్రసాద్ హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. ముఖ్యమంత్రికి సింగరేణి కార్మికుల సొంతింటి కల పథకానికి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సింగరేణి కార్మికులకు పెరిక్స్ ఇన్‌కం టాక్స్ యాజమాన్యం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. మెడికల్ బోర్డును ప్రకాశన చేయాలన్నారు. లాభాల వాటా 35శాతం చెల్లించాలని కోరారు. సింగరేణి మరింత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం సాధిస్తుందని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

లక్షెట్టిపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఉగ్యోగులు ప్రజలను సూచించారు. శుక్రవారం 100రోజుల ఆక్షన్ ప్లాన్‌లో బాగంగా పట్టణ మున్సిపాలిటీలోని 8వ వార్డులో ప్రజలతో మమేకమై పారిశుధ్య పనులను చేపట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు వార్డు ప్రజలు వార్డులోని పుల వీధుల గుండా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి షానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ రాజేష్, వార్డు ఆఫీసర్ సంతోష్‌తో పాటు మున్సిపల్ కార్మికులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ

శ్రీరాంపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కొందరి దాడిలో గాయపడి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ నస్పూర్ పట్టణ సోషల్‌మీడియా కో-కన్వీనర్ నీరటి సురేష్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, క్రిష్ణకాలనీకి చెందిన సురేష్‌పై కాంగ్రెస్ నాయకుడు అంగిడి రాజేశ్, గందు కిరణ్, వారి మిత్రులు అక్బర్, సంతోష్‌లు దాడి చేయడం సరికాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే చర్చించుకొని పరిష్కరించుకోవాలని, అంతేకాని దాడులకు పాల్పడడం సిగ్గు చేటన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మెర సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించేందుకు గాను శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

పురుషులతో సమానంగా విధులు నిర్వహించాలి

సమీక్ష సమావేశంలో అడిషినల్ డీజీపీ అభిలాష్ బిస్త్

నస్పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఫంక్షన్ వర్టికల్స్‌లోని అన్ని విధులు చేయాలని, పురుషులతో పాటు మహిళ పోలీసులు కూడా సమానంగా విధులు నిర్వహించాలని అడిషినల్ డీజీపీ (ఆర్‌బీవిఆర్ఆర్ డైరెక్టర్) అభిలాష్ బిస్త్ అన్నారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ సింగరేణి అధితి గృహంలో శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి ముఖ్య అధితిగా హాజరైనా అభిలాష్ బిస్త్ మహిళా పోలీస్ సిబ్బందితో, స్టేషన్‌లో, సెలవులు, పోస్టింగ్‌లు, డ్యూటీలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ డ్యూటీలో మెన్, విమెన్ విధులు అని వేరువేరు లేవన్నారు. పోలీస్ ఉద్యోగంలో ఎంపికైనా తర్వాత శిక్షణ సమయంలో మెన్‌తో పాటు సమానంగా శిక్షణ ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్లతో స్కూటీలను ఏర్పాటు చేయాలని, డ్రైవింగ్ శిక్షణ ఇప్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, జిల్లాలోని పోలీస్ మెన్స్, విమెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలోని ర్యాలీగడ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని క్వారీ దుర్గాదేవిని అభిలాష్ బిస్త్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మల్లారెడ్డి, పట్టణ సీఐ ప్రమోద్‌రావు, రూరల్‌సీఐ అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అడిషినల్ డీజీపీ అభిలాష్ బిస్త్

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

శ్రీరాంపూర్ : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆర్‌బీవీఆర్ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని పోలీస్‌స్టేషన్ ను గురువారం ఆమె తనిఖీ చేశారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ సం తోష్ ఆమెకు పూలమొక్కను అందించి స్వాగతం పలి కారు. ఏఆర్ మహిళా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలి లించి, రిసెప్షన్ విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బందితో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సిబ్బంది కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీసీపీ భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఆర్ఐ సంపత్, ఎస్ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా ఆటో కార్మికుల దినోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆటో కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముకేష్‌గౌడ్ కేక్ కట్ చేశారు. అనంతరం జెండా ఎగురవేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి నెల ఆటో కార్మికులకు రూ. 12 వేలు చెల్లించాలన్నారు. నాయకులు మురళీధర్, మధుకర్, విక్రమ్, రాంకుమార్, అంజయ్య, రాంబాబు, సంపత్‌కుమార్, శేఖర్, ప్రభాకర్, వెంకటేష్, సుధాకర్, రాజేందర్, గట్టయ్య, మహేష్, శ్రీనివాస్, బాబా, రాజన్న పాల్గొన్నారు.

తాండూర్ : ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నెలకు రూ. 12 వేలు భృతి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌ఖాన్, కొత్త శంకర్, సుభాకర్, విద్యాసాగర్, రాజనంద్, రవి పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ ముకేష్‌గౌడ్



నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ వెంకటేష్ దో త్రే అన్నారు. మండలంలోని గన్నారం జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలన్నారు. శుద్ధమైన తాగునీరు అందించాలని, విద్యార్థుల హాజరు శాతంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాని సూచించారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలపై ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యస్థను నిర్మూలించడానికి జూలై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ -11 ద్వారా అన్ని శాఖల సమన్వయంతో 48 మంది బాల కార్మికులను గుర్తించామని అన్నారు. ఆపరేషన్ ముస్కార్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన పిల్లలతో పాటు బాలకార్మికులుగా పని చేస్తున్న చిన్నారులను గుర్తించి పునరావాసం కల్పించామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్-11 ద్వారా జూలై 1 నుంచి 31 వరకు 48 మంది బాల కార్మికులను రెస్క్యూ చేయడం జరిగిందని అన్నారు. వీరిలో ఆసిఫాబాద్ డివజిన్ నుంచి 25 మంది, కాగజ్‌నగర్ డివిజన్‌లో 23 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. 18 సంవత్సరా లోపు వారితో పని చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సహకరించిన అధికారులను ఎస్పీ అభినందించారు.

ఇన్‌చార్జి డీఈవోగా దీపక్ తివారి నియామకం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా ఇన్‌చార్జి డీఈవోగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీపై వెళ్తున్న ఏపీఎంకు సన్మానం

వాంకిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఏపీఎంగా పని చేస్తూ సిర్పూర్(టి)కి బదిలీపై వెళ్తున్న ఏపీఎం మహేష్‌ను శుక్రవారం ఐకేపీ, మండల సమాఖ్య సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఎం శ్రావణ్, భీంరావు, శ్యాంరావు, వేణుగోపాల్, కవిత, సునీత పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

బెజ్జూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీలో ఒప్పంద ప్రతిపాదికన బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్ బోధించడానికి ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని, నర్సింగ్ బోధిం చడానికి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన మ హిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. శనివారంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు రంగం సిద్ధం



- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- జిల్లాలో భర్తీ కానున్న 95 పోస్టులు

ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గురువారం అందుకు షెడ్యూల్ జారీ చేసింది. ఖాళీలను ప్రకటించి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చే ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది.

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులకు రంగం సిద్ధమైంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యా యులుగా, ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందనున్నారు. సంబంధిత షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ గురువారం ప్రకటించింది. శనివారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు పదోన్నతులకు సంబం ధించిన పోస్టుల వివరాలు, సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. జిల్లాలో గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను వరంగల్ ఆర్జేడీకి ఇప్పటికే పంపించారు. ఆగస్టు 6న ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవల్సి ఉంది. ఎస్జీటీల సీనియారిటీ జాబితాలు కూడా జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. షెడ్యూల్ వెలువ డడంతో వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్న తులు కల్పించేందుకు అర్హులైన ఎస్జీటీలు తుది జాబి తాను ఆగస్టు 8న జిల్లా విద్యాశాఖ ప్రకటిం చనుంది. 10న వారు పదోన్నతులకు వెబ్ ఆప్షన్లను ఎంచుకోవల్సి ఉంది. 11న స్కూల్ అసిస్టెంట్లకు, 12న ఎస్జీటీలకు పదోన్నతుల ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ అనుమతితో అందించనున్నారు.

అన్ని కేడర్లలో కలిసి..

జిల్లాలో అన్ని కేడర్లలో కలిసి మొత్తం 2,295 పోస్టు లు మంజూరు ఉండగా ప్రస్తుతం 1,921 మంది పని చేస్తున్నారు. 374 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఏడు పీజీ హెచ్‌ఎం, 24 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు పోను స్కూల్ అసిస్టెంటు పోస్టుల ఖాళీల్లో 70 శాతం ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు. ఈ లెక్కన మొత్తం 92 స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల్లో సుమారు 64 పదోన్నతుల ద్వారా భర్తీకి అవ కాశం ఉంది. ఏడు పీజీ హెచ్‌ఎం, 24 పీఎస్ హెచ్‌ఎం పోస్టులతో కలుపుకుంటే మొత్తం 95 పోస్టుల్లో ఉపాధ్యా యులకు పదోన్నతులు లభించనున్నాయి.

పీజీ హెచ్‌ఎంలు..

జిల్లాలో స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల్లో ఐదు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రెండు రెండు పీజీ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసిఫాబాద్ మండలంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బూరుగూడ జడ్పీ ఉన్నత పాఠశాల, జడ్పీ ఉర్దూ మాధ్యమ పాఠశాల, బెజ్జూరు మండల పాపన్‌పేట, సల్గుపల్లి, దహెగాం, ఈస్‌గాం నంబరు ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్ఏ గణితం ఆరు, ఫిజికల్ సైన్స్ ఐదు, బయోసైన్స్ నాలుగు, సాంఘికశాస్త్రం 15, తెలుగు 12, హిందీ 11, ఇంగ్లీష్ మూడు, ఉర్దూ ఒకటి, పీడీ ఒకటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ముర్రుపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

వాంకిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతోనే పిల్లలకు ఆరోగ్యం ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తప్పని సరిగా తల్లిపాటు పట్టించాలన్నారు. తల్లి పాలతో రోగ నిరోధక శక్తి పెరుగుఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం రుక్మిణి, అంగన్‌వాడీ టీచర్లు ఊష, ప్రేమల, రుక్మిణి పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలి

జైనూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ఈ నెల 7 వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని జైనూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఇందిర అన్నారు. మండలంలోని పవర్‌గూడ ఐసీడీఎస్ కెంద్రంలో శుక్రవారం జరిగిన తల్లి పాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతిగౌడ్ సూపర్‌వైజర్ సోంబాయి, అంగన్‌వాడీ టీచర్ చక్రవతి, లలిత, మంగావతి, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



మహిళకు బిడ్డను అందజేస్తున్న సిబ్బంది

లింగాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని మూలగూడకు చెందిన కొడప మారు బాయి అనే మహిళ శుక్రవారం 108 అంబు లెన్స్‌లో ప్రసవించింది. మారుబాయి పురిటి నొప్పులతో బాధ పడుతుండగా అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది మారుబాయిని సిర్పూర్(యు) పీహెచ్‌సీకి తీసుకెళ్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. సిబ్బంది సహాయంతో మారుబాయి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం మారుబాయిని సిర్పూర్(యు) పీహెచ్‌సీకి తరలించామని సిబ్బంది తెలిపారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సిర్పూర్(టి), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సాంఘిక సంక్షేమ గురుకుల జోనల్ అధికారిణి అరుణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల బాలికల, బాలుర వసతి గృహాలను శుక్రవారం తనిఖీ చేశారు. గురుకులం బాలుర పాఠశాల శిథిలావస్థకు చేరడంతో పాఠశాలను వేరే భవనంలో మర్చాడానికి చర్చించారు. బాలుర పాఠశాల వసతి గృహం స్థితి గతులను నమోదు చేసుకుని రాష్ట్ర కార్యదర్శి దృష్టికి తీసుకు వెళుతామని తెలిపారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ శారద, శ్రీనివాస్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాజు

లింగాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ పెది రాజు అన్నారు. మండలంలోని గూంనూర్(కే),గూంనూర్(బి),కంచన్‌పల్లి, మూలగూడ, సుర్దంగూడ, పిట్టగూడ, తదితర పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పారిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

పాఠశాల తనిఖీ

సిర్పూర్(టి), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం, పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో సత్యనారాయణ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు జరుగుతున్న విద్యాబోధన, మెనూ ప్రకారం భోజనం తదితర వాటిపై ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలల్లో ఫేస్ రికగ్నిషన్ ప్రారంభం



హాజరు నమోదు చేస్తున్న ఎంఈవో వేణుగోపాల్‌రావు

సిర్పూర్(టి), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) అమలు ప్రారంభించారు. సిర్పూర్(టి) మండలం వెంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఎంఈవో వేణుగోపాల్ రావు స్వయంగా ఎఫ్‌ఆర్‌ఎస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని హాజరు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలలో ఈ రోజు నుంచి తప్పని సరిగా ఉదయం పాఠశాల ప్రారంభించిన వెంటనే ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమో దు చేయాలని తెలిపారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులం దరికీ ముఖ హాజరు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంఈవో సుభాష్ తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాలలో వచ్చిన ప్పుడు సాయంత్రం వెళ్లేటప్పుడు ముఖ హాజరు యాప్ ద్వారా అటెండెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని ఎంఈవో సుభాష్ తెలిపారు.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



సాముహిక మర్గుదొడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ మిషన్ కింద నిర్మించిన సాముహిక మరుగుదొడ్లను ప్రయాణి కులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్డీవో బానోత్ దత్తారావ్, డీపీవో భిక్షపతిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్ తదితరులు శుక్రవారం సాముహిక మర్గుదొ డ్లను ప్రారంభించారు. మండల కేంద్రానికి పనులు నిమిత్తం వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా సామూహిక మరుగుదొడ్డు నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఈవో కోరేంగ ఆనంద్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పదవి లేకున్నా ప్రజా సేవే ధ్యేయం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పదవి లేకున్నా ప్రజా సేవే ధ్యేయంగా నిత్యం వారితో మమేకమవుతున్నామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని మర్తిడి లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నియోజక వర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు, వంతెనల సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను ఓడినా గెలిచినా ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజలకు అండగా ఉండడమే లక్ష్యమని తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బషరత్‌ఖాన్, సకారాం, వెంకన్న, శేఖర్, సంతోష్, రాజేష్, వెంకన్న, సతీష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీఎఫ్‌ఐ జెండా ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌టీఎఫ్‌ఐ జాతీయ సంఘం రజతోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్‌టీఎఫ్‌ఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి హేమంత్‌షిండె మాట్లాడుతూ 2004 తరువాత నియా మకమైన ఉద్యోగులకు న్యూపెన్షన్ స్కీం శాపంగా మారిందని చెప్పారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్ర మంలో రమేష్, నవీన్‌కుమార్, రవి, సంతోష్, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చాలి



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆరె కులస్తులను ఓబీసీలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు కోరారు. ఈ మేరకు కేంద్ర రక్షణ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఎమ్మెల్యే హరీష్ బాబు శుక్రవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, ఆరె సంఘం నాయకులను ఓబీసీలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చన్నపురి గణపతి, జోకె దామోదర్, ఎల్మలే మల్లయ్య, సత్పుతే తుకారాం, రవీందర్, దుబ్బు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

కెరమెరి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్టీయూటీఎస్‌తోనే సాధ్యమవుతాయని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. మండలంలోని మోడి, గోయగాం, అనార్‌పల్లి, రాంజీగూడ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవీందర్, శివప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలో సోమవారం నుంచి నుంచి జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులకు ఎంపికైనట్లు గిరిజన సంక్షేమాధికారిణి రమాదేవి తెలిపారు. పాఠశాలకు చెందిన చిన్నుబాయ, శైలజ, నందిని, శరణ్య, మైని, భీమేశ్వరి, శాంతి, రాజేశ్వరి ప్రవళిక, లావణ్య, కమల, జయశ్రీలు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం క్రీడల అధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు, ఏసీఎంఓ ఉద్ధవ్, డీఎస్ఓ మీనారెడ్డి, జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ చిరంజీవి, హెచ్‌డబ్ల్యూఓ సాయిబాబా, శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ తదితరులు అభినందించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మోర్లే సాక్షి జావిలీన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాందాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆలీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సంతోష్, అధ్యాపకులు అభినందించారు.

అన్నా భావు సాఠేకు ఘన నివాళి



వాంకిడిలో అన్నా భావు సాఠే చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



జైనూర్‌లో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్

వాంకిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, రచయిత, జానపద కవి, దళిత ఉద్యమకారుడు అన్నా భావు సాఠే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటా నికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, దుర్గాజీ, జయరాం, విజయ్, రోషన్, ప్రశాంత్, ప్రతాప్, శ్యాంరావు, పితాంబర్ పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేశ్‌నగర్ కాలనీలో శుక్రవారం అన్నా భావు సాఠే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, మాట్లాడుతూ భావు సాఠే ప్రజలు చేసిన సేలు ప్రశంసనీయమని కొనియాడారు. సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మవాలె దత్త, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే బాబాసాహేబ్, కొలాం సంఘ నాయకులు ఆత్రం బాపూరావ్ తదితరులు పాల్గొన్నారు.